బనగానపల్లెలో రౌడీయిజం

- టీడీపీ శ్రేణులపై రెచ్చిపోయిన వైసీపీ మూకలు
- ఎమ్మెల్యే కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి ఓవరాక్షన్
- బీసీ ఇందిరమ్మపై దాడికి యత్నం
- ట్రే బాక్సులను విసిరేసి వీరంగం సృష్టించిన ఓబుల్ రెడ్డి
- ఆమెకు రక్షణ వలయంగా టీడీపీ శ్రేణులు
- తూకం రాళ్లతో హల్‌చల్ చేసిన అనుచరులు
- కూరగాయల మార్కెట్‌లో భయానక ఘటన..
- భయంతో పరుగులు తీసిన వ్యాపారులు, ప్రజలు

బీసీ ఇందిరమ్మపై దాడి చేస్తున్న ఎమ్మెల్యే కొడుకు కాటసాని ఓబుల్‌రెడ్డి





ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతం బనగానపల్లెలో మంగళవారం వైసీపీ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో మళ్లీ పాత రోజులను తలపించేలా వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. మహిళ అని కూడా చూడకుండా టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మపై దాడికి యత్నించాయి. ఆమెకు టీడీపీ కార్యకర్తలు రక్షణ వలయంగా నిలిచి కాపాడారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి రెచ్చిపోయి ప్రవర్తించాడు. కూరగాయల ట్రే బాక్సులను విసిరి కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. గొడవను నిలువరించాల్సిన అతనే రౌడీలా వ్యవహరించడంతో మార్కెట్‌లో ఉన్న ప్రజలు, వ్యాపారులు భయంతో పరుగులు తీయాల్సి వచ్చింది.

నంద్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి)/ బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో తెలుగుదేశం పార్టీ తరుపున ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి, దుర్గా, సుదర్శన్‌రెడ్డితో పాటు 50 మందికి పైగా వైసీపీ కార్యకర్తలు పట్టపగలు బీసీ ఇందిరమ్మపై, ప్రచారానికి వచ్చిన టీడీపీ కార్యకర్తలపై కూరగాయల మార్కెట్‌లో రాళ్ల దాడికి తెగబడ్డారు. మంగళవారం ఉదయం వైసీపీ వర్గీయులు కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేసుకుని వెళ్లిపోయారు. వైసీపీ వర్గీయులు వెళ్లిపోయిన అనంతరం పోలీసుల అనుమతి తీసుకుని బీసీ ఇందిరమ్మ, టీడీపీ కార్యకర్తలతో కలిసి బనగానపల్లె కూరగాయల మార్కెట్ వద్దకు ప్రచారానికి వచ్చారు. కూరగాయల మార్కెట్‌లో ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటుండగా మహిళ అని చూడకుండా వైసీపీ అల్లరి మూకలు దాడులకు తెగబడ్డాయి. వైసీపీ ప్రచార వాహనాన్ని అక్కడే నిలిపి భారీ సౌండ్ వచ్చేలా ఆ పార్టీ నాయకులు మైక్‌లను వినియోగించారు. టీడీపీ వర్గీయులు తాము ప్రచారం చేస్తుండగా వైసీపీ వాహనాన్ని కావాలనే పెట్టారని సీఐ సుబ్బారావుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ కూరగాయల మార్కెట్ వద్దకు చేరుకుని వైసీపీ నాయకులను హెచ్చరించారు. బీసీ ఇందిరమ్మ కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేయడాన్ని సహించలేని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్‌రెడ్డి, దుర్గా, సుదర్శన్‌రెడ్డి తదితర మూకలు ఇందిరమ్మ ప్రచారం చేస్తుండగా అక్కడకు చేరుకున్నారు. సీఐ గంటా సుబ్బారావును, పోలీసులను పక్కకు తోసుకుని వైసీపీ మూకలు కూరగాయల మార్కెట్‌లో చొరబడ్డాయి. ఇష్టానుసారంగా రాళ్ల, కూరగాయల ట్రే బాక్సులతో మూకుమ్మడిగా ఇందిరమ్మపై దాడులకు దిగారు. ఈ దాడుల్లో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. టీడీపీ కార్యకర్తలు బీసీ ఇందిరమ్మకు రక్షణ కవచంలా నిలిచి ఆమెను క్షేమంగా ఇంటికి తీసుకుపోయారు. పోలీసులు తక్కువ సంఖ్యలో ఉండడంతో వైసీపీ నాయకుల దాడిని నిలువరించలేకపోయారు. వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే కుమారుడు ఓబుల్ రెడ్డి నిర్వాకంతో భయభ్రాంతులకు గురైన వ్యాపారులు, ప్రజలు మార్కెట్ నుంచి పరుగులు తీశారు. ఇదిలా ఉండగా దాడులను పోలీసులు అక్కడే ఉండి కూడా నిలువరించడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



బీసీ ఇందిరమ్మకు రక్షణగా వచ్చిన యువకులు



సీఐ గంటా సుబ్బారావును తోసేస్తున్న కాటసాని ఓబుళరెడ్డి, తదితరులు

అధికార మదంతో విర్రవీగుతున్నాడు

- మహిళపై దాడి చేయడానికి సిగ్గుండాలి
- కాటసాని ఓబుల్ రెడ్డిపై బీసీ ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 7 : అధికార మదంతో ఎమ్మెల్యే కాటసాని కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి విర్రవీగుతున్నాడని టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బనగానపల్లె నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నాడన్నారు. తన గెలుపు ఖాయమవుతుందన్న విషయాన్ని ఓర్చుకోలేక వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే కొడుకు కాటసాని ఓబుల్‌రెడ్డి సిగ్గులేకుండా ఇలాంటి దాడులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. వైసీపీ నిర్వహించిన సర్వేలోనే బనగానపల్లెలో టీడీపీ గెలుస్తుందని తేలిందన్నారు. అందుకే అల్లరిమూకలతో ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. తాము అన్ని అనుమతులతోనే ప్రచారం చేస్తున్నామని, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రచార వాహనాల్లో వచ్చి అధిక సౌండ్‌తో వైసీపీ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. చిరు వ్యాపారుల ఆస్తులను, కూరగాయలను ధ్వంసం చేసి అక్కడ ఉన్న వాటిని నాశనం చేశారన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని బీసీ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, ఓటమి భయంతోనే కాటసాని కుటుంబం ఇలాంటి చీప్ ట్రిక్స్ పాల్పడుతోందన్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండో రోజూ అదే పరిస్థితి

- జాబితాల్లో పేర్లు లేవని ఓటర్ల మండిపాటు
- ఆత్మకూరులో ఆలస్యంగా మొదలైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ



పేర్లు లేకపోవడంతో ఎన్నికల అధికారులను ప్రశ్నిస్తున్న ఉద్యోగులు



నియోజకవర్గాల జాబితాల్లో పేర్లు సరిచూసుకుంటున్న ఉద్యోగులు

ఆత్మకూరు, మే 7: శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి ఆత్మకూరులో రెండో రోజు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ గందరగోళంగా సాగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైల నియోజకవర్గంలో పీవోలు, ఏపీవోలు, ఏపీఓలతోపాటు ఇతర అధికారులకు ఇక్కడే ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ఇదే నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు కూడా తమ ఓటు హక్కును ఇక్కడే ఉపయోగించుకోవచ్చని సూచించారు. అధికారుల సూచనలతో ఫెసిలిటేషన్ సెంటర్లకు వచ్చిన ఉద్యోగులకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎన్నికల విధులు కేటాయించిన నియోజకవర్గాల్లోనూ, నివాసం ఉండే సొంత నియోజకవర్గాల్లోని జాబితాలోనూ పేరు లేకపోవడంతో వారు మండిపడ్డారు. ఇతర జిల్లాలకు సంబంధించి ఉద్యోగుల పేర్లు లేకపోవడంతో వారు కూడా ఎన్నికల అధికారులను నిలదీశారు. అసలు తమ పేర్లు ఎలా గల్లంతయ్యాయని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. దీంతో మరోసారి ఫారమ్-12 కింద దరఖాస్తు చేసుకుంటే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం ఇస్తామని చెప్పడం చాలా మంది ఉద్యోగులు తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా పలు నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. దీంతో ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. అసలు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహించారు. మొత్తానికి పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగడంతో 9వ తేదీ వరకు పోలింగ్‌ను పెంచినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

పాలకుల వివక్షకు నిదర్శనం నీటి ప్రాజెక్టులు

బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, మే 7: రాయలసీమ పట్ల పాలకుల వివక్షకు, అలక్ష్యానికి ప్రాజెక్టులు నిదర్శనమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయంలో రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టుల క్షేత్ర స్థాయి వాస్తవ నివేదిక విడుదల చేశారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితిని సమాజం ముందుంచడానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలలో నాలుగు రోజుల పాటు 46 సెంటి గ్రేడ్ డిగ్రీల వేడిలో ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టామని అన్నారు. కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ, దిగువ ప్రాజెక్టులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, భానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్, తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, అలగనూరు, గోరుకల్లు తదితర నిర్మాణాలను, ప్రతిపాదిత గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, ఆర్‌డీఎస్ కుడి కాలువ ప్రదేశాలను సందర్శించామని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు కృష్ణా జలాలను దోచి పెట్టడానికి రాయలసీమ ప్రాజెక్టులను నాశనం చేశారని విమర్శించారు. నంద్యాల అభివృద్ధికి కీలకమయిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం భూములను 50 ఎకరాలు వైద్యశాల ఏర్పాటుకు కేటాయించిన తీరు తీవ్ర అభ్యంతరమని అన్నారు. రాయలసీమ సమాజం గాఢ నిద్ర నుంచి మేలుకొని తన ప్రాంతాన్ని కాపాడుకోవాల్సి ఉందని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, రాఘవేంద్ర గౌడ్, భాస్కర్‌రెడ్డి, సౌదాగర్ ఖాసీంమియా, మనోజ్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్ పర్వేజ్, పట్నం రాముడు, మధుసూదన్‌రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

భూములు కాజేసేందుకే..

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఆస్తులకు రక్షణ

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మే 7: ప్రజల భూములను కాజేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్‌రెడ్డి తీసుకొచ్చారని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రంలోనూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయలేదన్నారు. ప్రజల భూములను కబ్జా చేసేందుకే జగన్ రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందని తెలిపారు. ఇది అక్టోబరు 31 నుంచే అమలులోకి వచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం జీవో నెం.512ను విడుదల చేసిందని అన్నారు. ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసి దానికి చైర్‌పర్సన్, కమిషనర్ సభ్యులను నియమిస్తూ 2023 డిసెంబరు 29న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి ఇంకా ఈ చట్టానిక మార్గదర్శకాలు ఇవ్వలేదంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ల్యాండ్, సాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా రూ.8 లక్షల కోట్లు స్వాహా చేశారన్నారు. మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే.. వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి, తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారు, అన్వర్‌బాషా, వేణు, కేవీ మధు, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే విరమించుకోవాలి

వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైటిల్ రిజిస్ట్రేషన్, ల్యాండ్ అఫిలేట్ అథారిటీల నియామక సూత్రాలు, వివాదాల రిజిస్ట్రేషన్ నిర్వహణ, యాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టు పాత్రను పూర్తిగా ఈ యాక్ట్ తొలగించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి అబ్దుల్లా, శ్రీరాములు, అల్లాబాబు, నాగరాజు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బైరెడ్డి శబరి

నంద్యాల (కల్చరల్), మే 07: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022ను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులుకు నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022తో (ఆంధ్రప్రదేశ్ భూ యాజమా న్యహక్కు చట్టం)తో ప్రజల ఆస్తులకు జగన్ ప్రభుత్వంలో రక్షణ కరువైందన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల అతి సులువుగా ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం అవుతాయని తెలిపారు. టైట్లింగ్ రిజిస్ట్రేషన్, ల్యాండ్ అపిలేట్ అథారిటీ నియామక సూత్రాలు, వివాదాల రిజిస్ట్రేషన్ నిర్వహణ, యాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టుల పాత్ర పూర్తిగా తొలగించడం అన్యాయమని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒరిజనల్ పత్రాలను ఇవ్వకపోవడమంటే సామాన్య రైతుకు ఈ చట్టం భూమి దూరమైనట్లే అని అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి

రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఓటు హక్కును వినియోగించుకున్న 6,958 మంది ఉద్యోగులు

నంద్యాల(కల్చరల్), మే 7: జిల్లా వ్యాప్తంగా రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారులు శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మంగళవారం రాత్రి 7 గంటల వరకు ఓటింగ్ నిర్వహించారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ద్వారా అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు 6958 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో మొత్తం 12694 మంది ఎన్నికల విధుల్లో ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1818 మంది, శ్రీశైలంలో 1491, నందికొట్కూరులో 2056, డోన్‌లో 2209, నంద్యాలలో 3068, బనగానపల్లెలో 2052 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగంచుకున్నట్లు చెప్పారు.

డోన్, మే 7:

ఆర్థిక మంత్రి బుగ్గన అండతో మైనింగ్ మాఫియా చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. డోన్ నియోజకవర్గంలో ఖనిజ వనరులను మంత్రి బంధువులు ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. అధికార వైసీపీ నేతలు కొందరు కాసుల దాహంతో కొండలను మింగేశారు. విచ్చలవిడిగా గనుల్లో ఖనిజాలను దోచేస్తూ భారీగా సొమ్ము చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇతరులు మైనింగ్ చేసుకోవాలంటే మంత్రి బంధువులకు వాటాలు ఇవ్వాల్సిందే. పౌడర్ ఫ్యాక్టరీలను తమ గుప్పిట్లో ఉంచుకుని కొందరు మంత్రి బంధువులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఈ ఐదేళ్లలో మంత్రి బంధువులు రూ.కోట్లు ఆర్జించినట్లు తెలుస్తోంది. డోన్, ప్యాపిలి ప్రాంతాల్లో డోలమైట్, లైమ్ స్టోన్, వైట్‌సేల్ తదితర ఖనిజ సంపద పుష్కలంగా ఉంది. దీంతో మంత్రి నియోజకవర్గంలో మైనింగ్ వ్యవహారాలు చూసేందుకు ఇద్దరు బంధువులకు అన్ని అధికారాలు కల్పించారు. వారు భారీ ఎత్తున మైనింగ్ దందాలు కొనసాగించారనే విమర్శలు ఉన్నాయి.

కొండలను మింగేశారు..!

- మంత్రి బుగ్గన అండతో విచ్చలవిడిగా గనుల దోపిడీ
- మైనింగ్ చేసుకోవాలంటే ఆయనకు వాటాలు ఇవ్వాల్సిందే..
- పౌడర్ ఫ్యాక్టరీల నుంచి రూ.లక్షల వసూళ్లు
- చెక్‌పోస్టుల్లోనూ కొందరు వైసీపీ నాయకుల దందాలు

బావిపల్లి దగ్గర మైనింగ్ గనులు



డోన్ ప్రాంతంలోని కొచ్చెర్వు, కనపకుంట్ల, కమలాపురం, చిన్నమల్కాపురం, వలసల తదితర గ్రామాల పరిధిలో డోలమైట్, లైమ్‌స్టోన్, వైట్‌సేల్ మైనింగ్ గనులు ఉన్నాయి. భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు ఉంటేనే గనుల్లో ఖనిజాలను బయటకు తీయాలి. అయితే.. మంత్రి బుగ్గన బంధువులు కొందరు మైనింగ్ గనులపై కన్నేశారు. కొచ్చెర్వు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకున్నా కొండలను తవ్వేశారు. అక్రమ మైనింగ్‌తో లక్షల టన్నుల ఖనిజాలను ఎక్స్‌కవేటర్లతో బయటకు తీసినట్లు విమర్శలు ఉన్నాయి. గనుల్లో అక్రమ తవ్వకాలతో భారీగా సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. వలసల, చిన్న మల్కాపురం ప్రాంతాల్లో మైనింగ్ గనుల్లో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలతో ఖనిజ సంపదను కొల్లగొట్టారన్న ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.



మంత్రి బంధువుల దెబ్బకు పెద్ద పెద్ద కొండలు కరిగిపోయాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్యాపిలి మండలంలోని బావిపల్లి ప్రాంతంలో 200 ఎకరాల్లో మైనింగ్ గనులు ఉన్నాయి. డోలమైట్ ఖనిజం అధికంగా లభిస్తోంది. దీంతో మంత్రి అండదండలతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు గనులపై వాలిపోయారు. అక్రమ తవ్వకాలతో గనులను దోచేశారన్న ప్రచారం జరుగుతోంది. అక్రమ తవ్వకాలతో ప్రతిరోజూ వేల టన్నుల ఖనిజాన్ని బయటకు తరలిస్తున్న ఏడీఎంజీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. మంత్రి బంధువులు, అనుచరులు గనులను మింగేస్తున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్లు దండుకుని కిమ్మనకుండా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి బంధువులకు వాటాలిస్తేనే..

డోన్ ప్రాంతంలో మైనింగ్ చేసుకోవాలంటే మంత్రి బుగ్గన బంధువులకు వాటాలు ఇవ్వాల్సిందే. కొచ్చెర్వు, కనపకుంట, కమలాపురం, చిన్నమల్కాపురం, వలసల తదితర గ్రామాల పరిధిలో వివిధ రకాల మైనింగ్ లీజు గనులు ఉన్నాయి. ఈ గనుల్లో ఖనిజాలను బయటకు తీసి అమ్ముకోవాలంటే.. మంత్రి బంధువుల అనుగ్రహం కావాల్సిందే. ప్రతి మైనింగ్ గనిలోనూ తప్పనిసరిగా మంత్రి బంధువులు ఇద్దరికి వాటాలు ఇవ్వాల్సిందే. కొన్ని మైనింగ్ గనుల్లో 30 శాతం, మరి కొన్ని మైనింగ్ గనుల్లో 40 శాతం వరకు వాటాలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మంత్రి బంధువులకు వాటాలు ఇవ్వకపోతే మైనింగ్ గనుల్లో ఖనిజాలను బయటకు తీయలేని పరిస్థితి ఉంది. పట్టణానికి చెందిన ఓ మైనింగ్ వ్యాపారికి కొచ్చెర్వు ప్రాంతంలో ఉన్న మైనింగ్ గనిని మంత్రి బంధువులే గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. అడ్డగోలుగా ఆ మైనింగ్ గనిలో ఖనిజ తవ్వకాలను జరిపినట్లు విమర్శలున్నాయి. దీంతో చేసేదేమీ లేక మైనింగ్ వ్యాపారులు గనుల్లో వాటాలు తీసుకున్నట్లు తెలిసింది.



డోన్ సమీపంలోని పౌడర్ ఫ్యాక్టరీ

వైసీపీ నేతల గుప్పిట్లో పౌడర్ ఫ్యాక్టరీలు

డోన్ సమీపంలో పౌడర్ ఫ్యాక్టరీలు 70కి పైగానే ఉన్నాయి. ఇక్కడి పౌడర్ ఫ్యాక్టరీల నుంచే తయారయ్యే దానా కర్ణాటక రాష్ట్రంతో పాటు ఉభయగోదావరి జిల్లాలోని ఫిషరీస్ ఇండస్ట్రీస్‌కు పెద్ద ఎత్తున సరఫరా అవుతోంది. అదేవిధంగా ఇక్కడ తయారయ్యే వివిధ రకాల పౌడర్లు కర్ణాటక, మహారాష్ట, చెన్నై రాష్ట్రాల్లోని సోప్, కెమికల్స్, క్వార్ట్జ్ ఇండస్ట్రీస్‌కు రవాణా చేస్తున్నారు. దీంతో పౌడర్ ఫ్యాక్టరీలోనూ మంత్రికి సంబంధించిన బంధువులు తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారన్న విమర్శలున్నాయి. ఆ ఇద్దరు నేతల అనుమతులు ఉంటేనే పౌడర్ ఫ్యాక్టరీలకు ముడిసరుకు ఖనిజాలు సరఫరా అవుతాయి. లేదంటే పౌడర్ ఫ్యాక్టరీలకు ముడిసరుకు ఖనిజాలు అందవు. దీంతో ఫౌడర్ ఫ్యాక్టరీలకు సరఫరా చేసే ఖనిజాల్లో ఆ ఇద్దరు నేతల కనుసన్నల్లోనే ముడి ఖనిజాలను సరఫరా చేస్తూ వచ్చారు. ఇందులో భారీగా సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. అంతేగాక పౌడర్ ఫ్యాక్టరీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం, జరిమానాలు విధించడం తరచూ జరుగుతూ వచ్చింది. ఒక్కో పౌడర్ ఫ్యాక్టరీకి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించిన సందర్భాలు ఉన్నాయి. విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా మంత్రి బంధువులిద్దరికీ కాసుల పంట పండినట్లే. పౌడర్ ఫ్యాక్టరీలపై విధించిన జరిమానాలను లేకుండా చేస్తామని యజమానుల నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

చెక్‌పోస్టుల్లోనూ దందాలు

మైనింగ్ ఖనిజాల అక్రమ రవాణాను అరికట్టేందుకు డోన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లోనూ వైసీపీ నేతల దందాలు కొనసాగాయి. వివిధ రకాల ఖనిజాలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయి. రవాణా చేసే ఖనిజాలకు రాయల్టీలు ఉన్నాయా లేదా అనేది చెక్‌పోస్టుల్లో తనిఖీ చేసి వాహనాలను పంపాల్సి ఉంటుంది. దీంతో చెక్‌పోస్టుల్లోనూ వైసీపీలో కీలకంగా ఉన్న ఇద్దరు నేతలు వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. భూగర్భ శాఖ అధికారులు సైతం ఆ ఇద్దరి నేతల కనుసన్నల్లో పని చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో మైనింగ్ గనుల యజమానులు ఖనిజాలను చెక్‌పోస్టులు దాటి వెళ్లేందుకు పెద్దఎత్తున సమర్పించినట్లు తెలిసింది. ప్రతి నెలా ఒక్కో మైనింగ్ యజమాని రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఇద్దరు వైసీపీ నేతలకు ముట్టజెప్పాల్సి ఉండేదన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికారం అండతో చెక్‌పోస్టుల్లో ప్రతి నెలా రూ.లక్షలు వసూళ్లు చేసినట్లు మైనింగ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

పౌడర్ ఫ్యాక్టరీ



వైసీపీ సేవలో ఏడీఎంజీ అధికారులు

ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఆర్థిక మంత్రి బుగ్గన సేవలో తరించారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బంధువుల కనుసన్నల్లో ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. టీడీపీ నాయకులకు సంబంధించిన మైనింగ్ గనులను టార్గెట్ చేసి ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం సర్వసాధారణమైపోయింది. డోన్ ప్రాంతంలో టీడీపీలో కీలకంగా ఉన్న ముఖ్య నాయకుల గనులపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.కోట్లల్లో జరిమానాలు విధించారు. ప్యాపిలి మండలంలోనూ టీడీపీ నాయకులకు సంబంధించిన పలు మైనింగ్ గనులపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించారు. బేతంచెర్ల మండలంలో టీడీపీ నాయకుల మైనింగ్ గనులపై దాడులు నిర్వహించి రూ.కోట్లలో జరిమానాలు విధించారు. ఇదంతా కూడా మంత్రి సేవలో తరిస్తూ టీడీపీ నాయకులే లక్ష్యంగా ఐదేళ్ల పాటు దాడులు కొనసాగించారన్న విమర్శలున్నాయి. మంత్రి బంధువులు, అనుచరులు డోన్ నియోజకవర్గంలో మైనింగ్ గనుల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేస్తున్నా ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారులు ఏరోజు దాడులు చేసిన దాఖలాలు లేవు. ఏడీఎంజీ, విజిలెన్స్ అధికారుల తీరుతో డోన్ నియోజకవర్గంలో పలువురు టీడీపీ నాయకులు మైనింగ్ గనులను మూసివేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాయల్టీల జారీలోనూ ఏడీఎంజీ అధికారులు వైసీపీ నేతల కనుసన్నల్లోనే పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరు వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున లాబిన్ నడిపి రాయల్టీల జారీలో ఏడీఎంజీ అధికారుల ద్వారా రూ.లక్షలు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి.

మీ బాగోగుల బాధ్యత నాదే..



కర్నూలు(అర్బన్), మే 7: కర్నూలు టీడీపీ అభ్యర్థి వినూత్న రీతుల్లో ప్రచారం సాగిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇందులోభాగంగా మంగళవారం 44వ వార్డు రామలింగేశ్వరనగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఓ ఇంటి వద్ద వెళ్లిన ఆయన చిన్నారిని ఎత్తుకొని ముద్దాడారు. టీడీపీని గెలిపిస్తే ప్రజల బాగోగులను చూసుకుంటామని చెప్పారు.

తండ్రి ఫొటోతో తనయుడి ప్రచారం



ఎమ్మిగనూరు, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి తన తండ్రి దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఫొటోతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి ఫొటోను ముందుపెట్టుకొని ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీంతో టీడీపీ శ్రేణులతోపాటు ప్రజలు గతంలో బీవీ చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటున్నారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు నుంచి మూడో పర్యాయం టీడీపీ తరఫున బరిలో నిలిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తన తండ్రి ఫొటోతోనే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం గమనార్హం.

ప్రచారం నిర్వహిస్తున్న బీవీ



ఓటరు స్లిప్ అందలేదా.. ?

● పలు విధాలుగా ఓటరు స్లిప్ పొందవచ్చు ● బీఎల్‌వోల వద్ద ఓటర్ల వివరాలు

శిరివెళ్ల, మే 7 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న రాష్ట్రంలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఓటర్లకు ఓటరు స్లిప్‌లు(పోల్ స్లిప్పులు) పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందించడానికి బూత్ లెవెల్ అధికారులకు(బీఎల్‌వో) బాధ్యతలు అప్పగించారు. కానీ ఇప్పటికీ చాలా చోట్ల ఓటరు స్లిప్పులు అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు స్లిప్పులు అందకపోతే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఫోన్ ద్వారా సులువుగా..

ఎన్నికల సిబ్బంది నుంచి పోలింగ్ స్లిప్పులు అందకపోతే ఆన్‌లైన్, మొబైల్ యాప్, హెల్ప్‌లైన్ నంబర్‌తోపాటు మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా పొందేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను టైప్ చేసి 1950 లేదా 9211728082 అనే నెంబర్లకు ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తాయి. ఎలాంటి రుసుము లేకుండానే ఈ నెంబరుకు పంపిన వివరాలను సరిపోల్చుకుని ఎన్నికల సంఘం తగిన సమాచారాన్ని పంపుతుంది.

టోల్-ఫ్రీ నెంబర్ ద్వారా.. :

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24 గంటలూ పని చేసే హెల్ప్‌లైన్(టోల్-ఫ్రీ) నెంబర్ 1950కు ఫోన్ చేసి ఓటర్ల వివరాలను లేదా ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్ నెంబర్ తదితర వివరాలను పొందవచ్చు.

ఆన్‌లైన్ ద్వారా.. :

సీఈవోఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఓటర్స్ అనే మెనూలో సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఓటర్స్ లిస్ట్, నో యువర్ పోలింగ్ బూత్ అనే ఆప్షన్ల ద్వారా వివరాలను ఇచ్చి సమాచారం తెలుసుకోవచ్చు. ఇందులో ఆ ఓటరు సంబంధిత బీఎల్‌వో పేరు, ఫోన్ నెంబర్‌తోపాటు బూత్ నెంబర్, చిరునామా కూడా తెలుసుకోవచ్చు.



ఈ-మెయిల్ ద్వారా.. :

ఎన్నికల సంఘానికి ఈ-మెయిల్(కంప్లైయింట్స్‌రేటాఫ్‌ఈసీఐ.గవర్నమెంట్.ఇన్)కు ఫిర్యాదు(గ్రీవెన్స్) చేయడం ద్వారా పోలింగ్ బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారా పొందవచ్చు.

మొబైల్ యాప్‌తో.. :

ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఐఓఎస్ వినియోగదారులు యాప్ స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇవ్వడం ద్వారా ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాలో తెలుసుకోవచ్చు.

రెండో రోజు 2,374 మంది..

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్న ఉద్యోగులు

కర్నూలు(న్యూసిటీ), మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజు ప్రారంభమైంది. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 3,410 మంది ఉండగా, సోమవారం 79 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం 3,489 మంది అయ్యారు. ఇందులో ఇతర జిల్లాల ఓటర్లు 1103 ఉన్నారు. వీరిలో కర్నూలు అసెంబ్లీ నుంచి స్థానికులు 2,374 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 502 మంది తమ పోస్టల్ బ్యాలెట్‌ను వేసినట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ తీరును కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు.



ఆదోనిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంపీఐ దీప్తి

జగన్ వచ్చాక పింఛన్ పోయింది..!



నందవరంలో టీడీపీ నాయకులకు మొరపెట్టుకుంటున్న వృద్ధురాలు

జగన్ అధికారంలోకి వచ్చాక తన పింఛన్ కట్ చేశాడని నందవరానికి చెందిన వేదాత్తమ్మ అనే 90 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం ప్రచారానికి వచ్చిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు ముందు మొర పెట్టుకుంది. మళ్లీ టీడీపీ రావాలని, అప్పుడే అర్హులైన అందరికీ పింఛన్ వస్తుందని వృద్ధురాలు పేర్కొనడం గమనార్హం. చంద్రబాబు వస్తాడని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని దేశాయి చెపుతూ ఇంటింటా ప్రచారం చేశారు. -నందవరం

మహిళలతో ఓ సెల్ఫీ



శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం వెలుగోడు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బండిఆత్మకూరు మండల కేంద్రంలో మహిళలతో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం టీడీపీని గెలిపించాలని కోరారు. -వెలుగోడు

మా నాన్నను గెలిపించండి



శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గెలిపించాలని కోరుతూ.. ఆయన కుమార్తె డాక్టర్ బుడ్డా మేఘన మంగళవారం ప్రచారం చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలోని 6వ వార్డులో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ గెలిస్తే భవిష్యత్తు బాగుంటుందని తెలియజేశారు. -ఆత్మకూరు

వైసీపీ ఓటమి తథ్యం



సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి, కుమార్తెలు మనోరమారెడ్డి, బీసీ మాధవి అన్నారు. మంగళవారం ప్రజాగళంలో పాల్గొనేందుకు చెన్నంపల్లె గ్రామానికి చేరుకున్న బీసీ కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. - అవుకు



ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కర్నూలు నగరంలో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ బజ్జీలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు.





బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండలంలోని పేరుసోమలలో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించేందుకు మిద్దెలపైకి ఎక్కిన ప్రజలు

సార్వత్రిక ఎన్నికల సారథులు



నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి
- కర్నూలు కలెక్టరేట్

ఓటు హక్కు వినియోగించుకున్న అక్కాచెల్లెళ్లు



కర్నూలు(న్యూసిటీ), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధుల్లోని ఉద్యోగుల్లో ముగ్గురు అక్కా చెల్లెళ్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముగ్గురు సొంత అక్కా చెల్లెళ్లు ఒకే రోజు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడం కొసమెరుపు. ఇందులో ఒకరు పంచాయతీరాజ్ శాఖ, మరొకరు టీచర్, ఇంకొకరు సచివాలయ ఉద్యోగి కావడం గమనార్హం. మరొకరు కూడా పాణ్యం అసెంబ్లీ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వారు తెలిపారు.


ఓట్లంటే ఇంత హడావుడి ఉండేది కాదు



ఓట్లు వచ్చాయంటే అప్పట్లో ఇంత హడావుడి ఉండేది కాదు. ఇంత పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసిన దాఖలాలు ఎప్పుడూ లేవు. ప్రస్తుతం డబ్బులిచ్చి ఓట్లు కొనుక్కుంటున్న నేతలు, గెలిచిన తరువాత డబ్బు సంపాదనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రాన్ని, గ్రామాలను అభివృద్ధి చేసే నాయకులకే ఓట్లు వేయాలి. అటువంటి వారికే నా ఓటు.

బెలుం బాలయ్య (సీనియర్ ఓటరు)

టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన భూముల్లో జగన్ రియల్ వ్యాపారం



చేనేతల ద్రోహి జగన్

టెక్స్‌టైల్ పార్కు.. ఎమ్మిగనూరు చేనేత కార్మికుల చిరకాల స్వప్నం. మరమగ్గాల పోటీ తట్టుకోలేక చేనేత కార్మికులు చేతి మగ్గాలు వదలేస్తున్నారు. వీవింగ్, గార్మెంట్.. వంటి పరిశ్రమలు తీసుకొచ్చి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కుకు ఏర్పాటు చేయాలనుకుంది. బనవాసి పశు క్షేత్రంలో వంద ఎకరాలకు కేటాయించారు. మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదినలు సిద్ధం చేశారు. ఇదంతా సరిగ్గా ఎన్నికలు రాబోతుండగా చేయడంతో టీడీపీ స్వప్నం ఫలించలేదు. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం టెక్స్‌టైల్ పార్కుకు శాపంగా మారింది. ఈ పార్కుకు కేటాయించిన భూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. జగనన్న స్మార్ట్ సిటీ పేరిట 'కుడా' రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. ఇది చేనేతలకు ద్రోహం చేయడమే అని చేనేత కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రశ్నిస్తున్నారు.

- టెక్స్‌టైల్ పార్కుపట్ల నిర్లక్ష్యం
- పార్క్‌కు కేటాయించిన భూములు రద్దు
- 'కుడా' రియల్ వ్యాపారం
- టీడీపీ ప్రభుత్వం వస్తే పార్క్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ

కర్నూలు, మే 7 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మిగనూరు అంటేనే చేనేత వస్త్రాల ఉత్పత్తికి పెట్టింది పేరు. చీరలు, లుంగీలు, టవల్స్, దోమ తెరలు.. వంటి నూలు వస్త్రాలు మగ్గాలపై నేసేవారు. స్వాతంత్ర్యానికి పూర్వమే దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరు చేనేత పరస్పర సహకార సంఘం (ది ఎమ్మిగనూరు వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ) ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చారు. టెక్స్‌టైల్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు రావడం, మరమగ్గాలు పెరగడంతో చేనేతల వస్త్రాలకు డిమాండ్ తగ్గుతూ వచ్చింది. ఫలితంగా చేనేత మాగ్గాలనే నమ్ముకున్న వారికి ఉపాధి కరువు అయ్యింది. ఎమ్మిగనూరు, నందవరం, నాగులదిన్నె, గుడేకల్లు, గోనేగండ్ల, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో చేనేతలు అధికంగా ఉన్నారు. గద్వాల పట్టు చీరలు నేసే జాకాటీ మగ్గాలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఉపాధి చూప లేదు. ఈ పరిస్థితుల్లో చేనేతలకు ఉపాధి కల్పించాలంటే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు ఎంతో ఆశవ్యకత ఉందని 2003లో ఆనాటి మంత్రి బీవీ మోహన్‌రెడ్డి గుర్తించారు.



జగనన్న స్మార్ట్ సిటీ పేరిట రియల్ ఎట్టేట్ వ్యాపారం:

జగన్ ప్రభుత్వం వచ్చాక టెక్స్‌టైల్స్ పార్కుకు కేటాయించిన భూములను రద్దు చేశారు. అక్కడే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరిట 'కుడా' ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టింది. 110 ఎకరాల్లో 1,097 ప్లాట్లు (3 సెంట్ల ప్లాట్లు 447, 4 సెంట్ల ప్లాట్లు 460, 5 సెంట్ల ప్లాట్లు 190) వేసింది, సెంటు రూ.2.75 లక్షలకు బేరం పెట్టింది. దాదాపుగా 10 వేల మంది చేనేత కార్మికులు, గార్మెంట్ వస్త్రాల ఉత్పత్తి చేసే టైలర్లకు ఉపాధి కల్పించాలనే టెక్స్‌టైల్ పార్కును అట కెక్కించి ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం విమర్శలకు గురైంది. తాజాగా యువగళం పాదయాత్రలో టీడీపీ యువనేత నారా లోకేశ్, తేరు బజారులో జరిగిన బాదుడే బాదుడు, ప్రజాగళం సభల్లో మాజీ సీఎం చంద్రబాబు టీడీపీ ప్రభుత్వం రాగానే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మిగనూరు చేనేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే.. ఎమ్మిగనూరులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో సీఎం జగన్ టెక్స్‌టైల్ పార్కు పేరు కూడా ఉచ్చరించలేదు. ఇది చేనేత కార్మికులపై వైసీపీ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని చేనేత కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.





టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి వేసిన శిలాఫలకం (ఫైల్)

టీడీపీ ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కుకు వంద ఎకరాలు

బనవాసి పశు క్షేత్రంలో అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కు (టెక్స్‌టైల్ పార్కు) ఏర్పాటుకు 2004 ఫిబ్రవరి 15న అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, మంత్రి బీవీ మోహన్ రెడ్డి శంకుస్థాన చేసి శిలాఫలకం వేశారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టెక్స్‌టైల్ పార్కును అటకెక్కించింది. ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కూడా పట్టించుకోకపోవడంతో చేనేతల స్వప్నమైన టెక్స్‌టైల్ పార్కు కనుమరుగైంది. పదేళ్ల తరువాత 2014లో బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో మళ్లీ టెక్స్‌టైల్ పార్కుకు జీవం వచ్చింది. ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి.. ఆనాటి సీఎం చంద్రబాబును ఒప్పించి బనవాసి పశు కేత్రంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు వంద ఎకరాలు భూమి కేటాయించేలా చేశారు. పశు సంవర్ధక శాఖ నుంచి ఏపీ జౌళి, టెక్స్‌టైల్ శాఖకు ఆ భూమిని బదలాయిస్తూ ప్రత్యేక జీవో ఇచ్చారు. అంతేకాదు.. రోడ్లు, నీరు, విద్యుత్.. వంటి మౌలిక వసతుల కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అదే క్రమంలో ఇక్కడ వీవింగ్, గార్మెంట్, రెడీమేడ్ దుస్తుల తయారు చేసేందుకు గుజరాత్, మహారాష్ట్ర, బెంగళూరు.. వంటి ప్రాంతాల్లోని ప్రముఖ కంపెనీలతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలుమార్లు సంప్రదించారు. వారు కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఎంఓయూ చేసుకోవాల్సిన కీలక సమయంలో ఎన్నికలు వచ్చి టీడీపీ ప్రభుత్వం పడిపోయింది. వైసీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును పట్టించుకోలేదు.

వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్



హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 7: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా జిల్లాలో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగులకు ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. మంగళవారం హోం ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి వద్దనే ఓటు వేస్తామని దరఖాస్తు చేసుకున్న వారికి హోం ఓటింగ్ విధానం ద్వారా ఓటు హక్కు కల్పించామన్నారు. కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో కుమ్మరి వెంగమ్మ (87) సంవత్సరాల వృద్ధ మహిళకు, కల్లూరు మండలం లక్ష్మీ టౌన్‌షిప్‌లో ఉన్న మల్లికార్జునరావు (86) అనే వయోవృద్ధుడికి హోం ఓటింగ్ విధానం ద్వారా ఓటు హక్కు అవకాశం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కోడుమూరు ఆర్వో శేషిరెడ్డి, కల్లూరు తహసీల్దార్ మునివేలు పాల్గొన్నారు.

40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు



కర్నూలు (కలెక్టరేట్), మే 7: సాధారణ ఎన్నికల నేపథ్యంలో 40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన మంగళవారం తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కర్నూలు-1, పత్తికొండ-5, కోడుమూరు-4, ఎమ్మిగనూరు-3, మంత్రాలయం-4, ఆదోని-1, ఆలూరు-6, పాణ్యం-4 కలిపి మొత్తం 28 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా మహిళా పోలింగ్ సిబ్బందితో నిర్వహించేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 8 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో 28 మోడల్ పోలింగ్ స్టేషన్లు, మహిళల నిర్వహణలో ఎనిమిది పోలింగ్ స్టేషన్లు, యువత నిర్వహణలో రెండు పోలింగ్ స్టేషన్లు, వికలాంగుల నిర్వహణలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

- 137- కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం - కేవీఆర్ డిగ్రీ కళాశాల, పోలింగ్‌స్టేషన్ నెంబర్.33, రూమ్.నెం.14 (వెస్ట్ వింగ్), నరసింహారెడ్డి నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, కర్నూలు.
- 138- పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.88, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, 6వ తరగతి బాలికల గది, ఇందిరాగాంధీ కాలనీ, బీసీ కాలనీ, కల్లూరు.
- 142- పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.216, గ్రామ పంచాయతీ కార్యాలయం, వెల్దుర్తి గ్రామం, మండలం
- 143- కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.111, కేశవరెడ్డి ఇంగ్లీషు స్కూల్, నర్స రీ-ఎ, న్యూపోస్టల్ కాలనీ, స్టాంటన్‌పురం, హెచ్/ఓ మామిదాలపాడు, కర్నూలు రూరల్ మండలం
- 144- ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్.నెం.174, 1వ తరగతి గది, ఎంపీపీ పాఠశాల, బనవాసి ఫార్మ్, ఎమ్మిగనూరు మండలం
- 145- మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం.72, జడ్పీ ఉన్నత పాఠశాల, కొత్త భవనంలోని సిబ్బంది గది, మంత్రాలయం
- 146- ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం.250, జీఎంసీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (తూర్పు విభాగం), ఆదోని
- 147- ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం - పోలింగ్ స్టేషన్ నెం.127, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఆలూరు మండలం

యువ పోలింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా కర్నూలులో-1, ఆదోనిలో 1, కలిపి మొత్తం రెండు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్ నెం 107, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్, నర్సరీ బ్లాక్, రూమ్ నెం.5, ఎ.క్యాంపు, కర్నూలు.
- 146- ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం- పోలింగ్ స్టేషన్.నెం.255, సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్, (1వ తరగతి గది), ఆదోని.
- వికలాంగులైన పోలింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో-2 ప్రత్యేకమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.
- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, పోలింగ్ స్టేషన్ నెం.45, రూం.నెం.26, ఎస్‌పీపీ క్యాంపు, కర్నూలు
- 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం- ప్రభుత్వ జూనియర్ కళాశాల, టౌన్, పోలింగ్ స్టేషన్ నెం.153, రూమ్ నెం.9, జువాలజీ ల్యాబ్, కర్నూలు.



ఓటర్లకు ఉక్కపోత

- నాలుగు గంటలపాటు నిరీక్షించిన ఉద్యోగులు
- నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్



కర్నూలు(న్యూసిటీ), మే 7: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు వచ్చే ఉద్యోగులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎ.క్యాంపు ఇందిరాగాంధి మెమోరియల్ పాఠశాలలో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. ఓటు వేసే బూత్‌లలో సరైన గాలి లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం గాలి వచ్చేందుకు కూలర్‌కు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఆసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2, 4 రూమ్‌లలోనే ఈ పరిస్థితి ఉందని, ఇంకో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఓటర్లు కోరారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు భోజనానికి వెళ్లడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దూదేకుల సంక్షేమానికి కృషి: శబరి



మాట్లాడుతున్న టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి

నంద్యాల (నూనెపల్లె), మే 7: దూదేకుల, నూర్‌బాషా సామాజిక వర్గ సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందని టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, అసెంబ్లీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. ఏపీ రాష్ట్ర దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్ ఆధ్వర్యంలో మంగళవారం దూదేకుల, నూర్ బాషా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బైరెడ్డి రాజశేఖరరెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా చేనేత కులస్థుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపాలి: ఫరూక్



ప్రచారం చేస్తున్న ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని, కూటమిని గెలిపించాలని టీడీపీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం 9వార్డులో ప్రజాగళం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫరూక్ మాట్లాడుతూ వార్డు పర్యటనల్లో ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెడుతున్నారని, ఐదేళ్ల పాలనలో ప్రజలకు వైసీపీ ఏమి చేసిందని ప్రశ్నించారు. టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఫరూక్, డాక్టర్ రవికృష్ణ, ఫయాజ్, ఖలీల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: కాంగ్రెస్ పార్టీ నుంచి ఫరూక్‌నగర్ వాసులు టీడీపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, ఫరూక్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువత భారీ ర్యాలీ చేపట్టి మంగళవారం టీడీపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'శిల్పాకు ఓటమి తప్పదు'



నంద్యాలలో ప్రచారం చేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి, ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), మే 7: నందే ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డికి ఓటమి తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండఈ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలోని 40వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ నంద్యాలలో టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. టీడీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ , ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పాలి: మాండ్ర



మద్దూరులో ప్రచారం చేస్తున్న శివానందరెడ్డి, జయసూర్య

పాములపాడు, మే 7: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశమైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య పిలుపునిచ్చారు. మండలంలోని మిట్టకందాల మద్దూరు, వానాల గ్రామాల్లో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి తప్ప నేటి వైసీపీ పాలనలో ఒరిగిందేమి లేదన్నారు. నిరుద్యోగులను, ఉద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దే సమర్థమైన నాయకుడు ఒక్క చంద్రబాబే అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యను, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని అఖండ మెజారిటీతో గెలిపించాలని మాండ్ర కోరారు. తిమ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, రఘురామి రెడ్డి, హరి ప్రసాద్, మల్లికార్జున యాదవ్, భీమశేఖర్, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: వైసీపీకి స్థానికంగా ఉన్న 70వేల మంది దళితుల్లో ఒక్కరూ కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా కనిపించలేదా? అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య ప్రశ్నించారు. నందికొట్కూరు పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 18,19, 29, 22, 23, 21, 2, 7 వార్డుల్లో గిత్తా జయసూర్య రోడ్డు షో నిర్వహించారు. ముందుగా సూర్యనారాయణ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 70 వేళ మంది దళితులు ఉండగా నాలుగు దఫాలుగా ఒక్కసారి కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకు అవకాశం కల్పించలేదన్నారు. టీడీపీ మొదటి నుంచి కూడా స్థానికులైన దళితులకే ప్రాధాన్యం ఇస్తూ ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయిస్తోందన్నారు. ఈ సారి ఏకంగా కడప జిల్లాకు చెందిన ధనవంతుడిని వైసీపీ బరిలో దించి నియోజకవర్గంలోని దళితులను అవమానపరిచిందని అన్నారు. పట్టణంలో ఓ దళిత టీడీపీ నాయకుడు స్టేషన్‌లో ఉండగా కూడా వైసీపీ నాయకులు దాడి చేశారంటే నందికొట్కూరు ప్రజలకు రక్షణ ఎలా ఉందో అర్థమవుతోందని అన్నారు. రంజాన్ మాసంలో ఓ ముస్లిం మహిళ పట్ల వైసీపీ నాయకుడు ప్రవర్తించారని అన్నారు. అరాచక పాలన కొనసాగించిన వైసీపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, టీడీపీ నాయకులు ముర్తుజావలి, కళాకర్, నిమ్మకాయల మోహన్, రాజు, రాజన్న, శాంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాండ్ర లింగారెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం మాండ్ర లింగారెడ్డి సమక్షంలో తర్తూరు గ్రామ టీడీపీ నాయకుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో తర్తూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ శివరామకృష్ణారెడ్డి, శ్రీనాథరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనావాసరెడ్డి, రఘునాథరెడ్డి, గోపాలస్వామి, జమ్మన్న, శ్రీవాసులు, విజయ్, శంకర్, చెన్నయ్య, బాలస్వామి,రవి, సుంకన్న తదితరులు ఉన్నారు.

● టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర లింగారెడ్డి, ఉమాదేవి సమక్షంలో కొత్తపల్లె మండల టీడీపీ కన్వీనర్ నారపురెడ్డి ఆధ్వర్యంలో గువ్వలకుంట్ల గ్రామ వైసీపీ నాయకులు మహిళలు గ్రేసమ్మ, భక్తుడు, వై.ఇందిరమ్మ, మరియమ్మ, ఎం.ఇందిరమ్మ, కాంతమ్మ, కుమారి, సువార్తమ్మ, మోహన్‌రాజు, ఉదయ్‌కుమార్, ప్రశాంత్, దొరబాబు, 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

మిడుతూరు: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు పెద్ద పీట వేస్తుందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అలగనూరు, సుంకేసుల, మిడుతూరు గ్రామాల్లో మంగళవారం మాండ్ర శివానందరెడ్డి అధ్యక్షతన, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో సధాకర్, శేషిరెడ్డి, రాంబూపాల్ రెడ్డి, కాతా రాములు రెడ్డి, భగీరథ రెడ్డి, సోమసుందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామస్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రవీంద్ర బాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.



అల్లూరులో టీడీపీలో చేరిన తర్తూరు వైసీపీ నాయకులు



ఉమాదేవి, లింగారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు



నందికొట్కూరులో రోడ్ షో నిర్వహిస్తున్న జయసూర్య

టీడీపీని ఆదరించాలి: బుడ్డా



ఎర్రగుంట్లలో ప్రసంగిస్తున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

బండిఆత్మకూరు, మే 7: ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రజలంతా సైకిల్‌కు ఓటు వేసి టీడీపీకి పట్టం కట్టి ఆశీర్వదించాలని శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని ఎ.కోడూరు, పార్నపల్లె, కాకనూరు, ఎర్రగుంట్ల, లింగాపురం, పరమటూరు, సంతజూటూరు గ్రామాల్లో బుడ్డా సుడిగాలి పర్యటన నిర్వహించారు. అరాచక వైసీపీని ఓటుతో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. సుపరిపాలన అందించే చంద్రబాబును మళ్లీ సీఎంను చేసుకోవాలని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల లబ్ధిని గ్రామాల్లో వివరించారు. కార్యక్రమాల్లో వడ్డు మధుసూదన్‌రెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, శివకుమార్, బుల్లెట్ రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సిద్ధయ్య, రఘుస్వామిరెడ్డి, షేక్‌బాబు, హేమసుందర్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, సాయిబాబారెడ్డి, మాధవరెడ్డి, లాయర్ కృష్ణారెడ్డి, రామచంద్రుడు, తిరుపాల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: బండిఆత్మకూరు గ్రామానికి చెందిన 50 యాదవ కుటుంబాలు, 30 దళిత కుటుంబాలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళవారం వైసీపీకి చెందిన వీరందరికీ నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా బుడ్డా ఆహ్వానించారు. అలాగే పార్నపల్లెలో పలు ముస్లిం కుటుంబాలు బుడ్డా సమక్షంలో వైసీపిని వీడి టీడీపీలో చేరాయి.

'మా నాన్నను గెలిపించండి'

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గెలిపించాలని కోరుతూ.. ఆయన కుమార్తె డాక్టర్ బుడ్డా మేఘన మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని 6వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. 40ఏళ్లకు పైగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉంటూ ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఇక్కడి ప్రజలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ప్రత్యేకించి ఇప్పటివరకు నియోజకవర్గంలో జరిగిన చెప్పుకోదగ్గ అభివృద్ధి పనుల్లో బుడ్డా కుటుంబం పాత్ర తప్పక ఉందని గుర్తుచేశారు. ఇకపోతే తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సుమారు రూ.1500 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. మేలు చేసే నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని, లేకపోతే నష్టపోయేది ప్రజలేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో పేద ప్రజలకు మేలు జరగనుందని చెప్పారు. నాయకులు కలీముల్లా, నజీర్, హాషం, వస్సీల్ మున్నా, గౌస్, మహెబూబ్, రసూల్, చేపల మాబాషా, అలిషేర్ తదితరులు ఉన్నారు.

'ప్రజల ఆదరణకు రుణపడి ఉంటాం'

ఆత్మకూరు: శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన బాబాయి బుడ్డా రాజశేఖరరెడ్డి గెలుపు కోసం తాము చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ప్రజలు చూపిస్తున్న ఆదరణకు రుణపడి ఉంటామని మాజీ ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి కుమార్తె బుడ్డా వైష్ణవి రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆత్మకూరులోని సాయిబాబానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుడ్డా గెలుపుతోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమని వివరించారు. జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కర్నాటి శ్రీరాములు ఉన్నారు.

వెలుగోడు: రాష్ట్రంలో చంద్రబాబుతోనే యువతకు భవిత సాధ్యమని బుడ్డా శైలజ అన్నారు. మంగళవారం వేల్పనూరులో ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోతో రాష్ట్రంలోని ప్రజలందరూ జగన్‌ను సాగనంపేందుకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. అలాగే వెలుగోడు పట్టణంలో మాజీ ఎంపీపీలు అన్నారపు సీతమ్మ, చంద్రా సీతామహాలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ కలాం తదితరులు ప్రచారం చేశారు. కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, మహేశ్వరరెడ్డి, న్యాయవాది రవికుమార్, మాజి సర్పంచ్ కలాం, ఖలీల్, హిదాయత్ రసూల్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



బండిఆత్మకూరులో టీడీపీలో చేరిన యాదవ కుటుంబాలు



వేల్పనూరులో ప్రచారం చేస్తున్న బుడ్డా శైలజ



ఆత్మకూరులో ప్రచారం చేస్తున్న బుడ్డా వైష్ణవి

నందిపల్లిలో కోడ్ ఉల్లంఘన

● ఇళ్లకు సిద్ధం స్టిక్కర్లు అతికించిన వైసీపీ శ్రేణులు


● టీడీపీ ఫిర్యాదుతో స్టిక్కర్లను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

మహానంది, మే 7: మహానంది మండలం నందిపల్లిలో వైసీపీ నాయకులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారు. సోమవారం రాత్రి గ్రామంలో ప్రచారం నిర్వహించిన వైసీపీ కార్యకర్తలు పనిలో పనిగా సీఎం జగన్ ఫొటోతో ఉన్న సిద్ధం స్టిక్కర్లను ఇంటింటికి అతికించారు. దీంతో టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వీఆర్‌ఏ వెంకటేశ్వర్లు ఇళ్లకు అతికించిన స్టిక్కర్లను తొలగించారు.



స్టిక్కర్‌ను తొలగిస్తున్న వీఆర్‌ఏ

సచివాలయం వాట్సాప్ గ్రూపులో వైసీపీ ప్రచారం


Today

Volunteer
Forwarded
** సంక్షేమ పథకాల (చేయూత, ఈబీసీ నేస్తం, ఇన్పుట్ సబ్సిడీ...) డబ్బులు ఆపమని ఈసీకి లేఖ రాసిన బాబు!*
** నెల నుండి ఈసీ అనుమతి కోసం వేచి చూస్తున్న ఏపీ సర్కార్...*

https://pakkatelugu.com/political/andhrapradesh/ap-elections-conspiracies-of-chandrababu-and-co-on-dbt-payments-pressure-on-ec-in-the-name-of-election-code/

పూర్తి వివరాల కోసం పైన ఉన్న లింక్ క్లిక్ చేయండి 👆👆
1:06 pm

గ్రూపులో ఫార్వర్డ్ చేసిన సందేశం

పాణ్యం, మే 7: మండలంలోని భూపనపాడు సచివాలయం వాట్సాప్ గ్రూపులో వైసీపీనా గెలిపించాలని కోరుతూ, చంద్రబాబును చిత్తుగా ఓడించాలని ప్రచారం చేశారు. మంగళవారం గ్రామంలోని ఓ వలంటీరు సెల్ నుంచి సచివాలయం గ్రూపులో ఇంటింటికి పెన్షన్ రాకపోవడానికి, వృద్ధుల మృత్యువాతకు, అవ్వతాతల కన్నీటికి చంద్రబాబు కారణమని పోస్టు పెట్టారు. అలాగే ఫార్వర్డ్ చేశారు. జూన్ నుంచి మళ్లీ వలంటీర్ మీ ఇంటికి పెన్షన్ తెచ్చి ఇస్తాడని సీఎం జగన్ ఇస్తున్న హామీకి మద్దతుగా ఫ్యాన్‌కు ఓటు వేయాలని కోరుతూ మెసేజ్ పెట్టారు. అలాగే డబ్బులు ఆపాలని ఈసీకి చంద్రబాబు లేఖ రాశారని, నెల రోజుల నుంచి ఈసీ అనుమతి కోసం ఏపీ సర్కార్ వేచి చూస్తోందంటూ సందేశంలో ఉంది. దీనిపై పింఛన్‌దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెల లబ్ధిదారులకు వచ్చే సమాచారం పరిధిలో ఈ సమాచారం పంపించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరు చరిత తెలిపారు. సమాచారం పంపిన వారిపై చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులను కోరనున్నట్లు తెలిపారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

ఆత్మకూరు రూరల్, మే 7: ఆత్మకూరు మండల పరిధిలోని కరివేన గ్రామంలో వర్షపు నీరు ప్రవహించే విషయంపై ఇరువురు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. కరివేన గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించకుండా బర్నాల శ్రీనివాసులు అనే వ్యక్తి రోడ్డుపై మట్టి, రాళ్లతో అడ్డుకట్ట వేశాడు. దీంతో ఈ నీరు అతని పక్కనే ఇంట్లో నివాసముంటున్న బండగార్ల వెంకటేశ్వర్లు(52) ఇంట్లోకి ఈ నీరు ప్రవహిస్తుండటంతో దానిని తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితున్ని కుటుంబ సభ్యులు ఆత్మకూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ పరీక్షించిన వైద్యులు వెంకటేశ్వర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు భార్య లక్ష్మి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు



శ్రీశైలంలో పూజలందుకున్న బయలు వీరభద్రస్వామి

శ్రీశైలం, మే 7: శ్రీశైలం మహాక్షేత్రంలో కొలువైన క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు జరిగాయి. మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని రాత్రి 7 గంటలకు బయలు వీరభద్ర స్వామికి అర్చకులు పంచామృతాభిషేకం, పుష్పార్చనలు నిర్వహిం చారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామికి, శనగల బసవయ్యకు విశేష పూజలు జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ ప్రచారం

పగిడ్యాల, మే 7: మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరిలను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు.

జైలు శిక్ష

నంద్యాల క్రైం, మే 7: నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైటిపేటకు చెందిన మనోహర్ అనే వ్యక్తి మద్యం తాగి ప్రజలు, వాహనాలకు ఆటంకం కలిగించిన కేసులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నాలుగు రోజుల కారాగార శిక్ష విధించినట్లు సీఐ బి.వెంకటచలపతి మంగళవారం తెలిపారు. బైటిపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో అదే వీధికి చెందిన మనోహర్ అనే వ్యక్తి మద్యం తాగి ప్రజలు, వాహనాలకు ఆటంకం కలిగిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో గస్తీలో ఉన్న కానిస్టేబుళ్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. మనోహర్‌ను నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరచగా నాలుగురోజుల కారాగార శిక్ష విధించారని చెప్పారు. సీఐ వెంకటచలపతి మాట్లాడుతూ నంద్యాల వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో ఎవరైనా పోలీసుల అనుమతిలేకుండా వ్యక్తిగత కార్యక్రమాల కోసం స్థానికులను గానీ, దారిన వెళ్లే ప్రజలను గానీ, వాహనాలను గానీ అడ్డగించి ప్రజాశాంతికి భంగం కలిగించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'నిరుద్యోగులను మోసం చేసిన జగన్'



చిందుకూరులో లక్ష్మీనరసింహయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

గడివేముల, మే 7: డీఎస్సీ పేరుతో సీఎం జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. మండలంలోని గోరుకల్లు, దుర్వేసి, చిందుకూరు, గ్రంధివేముల, పెసరవాయి తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతోంద న్నారు. మెగా డీఎస్సీ కల్పించి, నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ ఇప్పిస్తామన్నారు. రైతులకు రూ.2లక్షల మేర రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. సీపీఎం పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌస్ దేశాయ్, కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు.

ముచ్చుమర్రిలో పిడుగుపాటు

● కొబ్బరి చెట్టుపై మంటలు



కాలిపోతున్న కొబ్బరి చెట్టు

పగిడ్యాల, మే 7: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగు పడింది. సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో బస్టాండ్ సమీపంలో ఉన్న పార్కులోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు వ్యాపించాయి. ఆసమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

రుద్రవరం, మే 7: మండలంలోని కోటకొండ సమీపంలోని చెంచు గూడెం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కోటకొండ నుంచి గాజులపల్లె మెట్ట వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కోటకొండ గ్రామానికి చెందిన భాస్కర్(34) నంద్యాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మెహెర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడగా నంద్యాల నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భాస్కర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

టీడీపీని గెలిపించండి: బైరెడ్డి శబరి


కునుకుంట్లలో ప్రచారం చేస్తున్న బైరెడ్డి శబరి

అవుకు, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం అవుకు మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చేరుకున్న బైరెడ్డి శబరికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిలతో ఎన్నికల ప్రచారం చేశారు. కొండమనాయినిపల్లెలో టీడీపీ నాయకులు ఆకులనాగిరెడ్డి, శివారెడ్డి, రాయలసీమ ఉద్యమ కారుడు సీమకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు హరికృష్ణ, శ్రీరాములు, సుధాకర్, హనుమాన్‌నాయక్ తదితరులతో ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. బైరెడ్డి శబరి మాట్లాడుతూ కొండమనాయినిపల్లె గ్రామంలోని ప్రజలు గత 40 ఏళ్లుగా తమకు నచ్చిన వారికి ఓటు వేసిన దాఖలాలు లేవన్నారు. చల్లా కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పోటీ ఏకపక్షంగా సాగేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన సుబ్బారెడ్డి


పుంగనూరులో చంద్రబాబుతో సుబ్బారెడ్డి

డోన్, మే 7: టీడీపీ అధినేత చంద్రబాబును పుంగనూర్‌లో మంగళ వారం టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహకార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుంగనూరు అసెంబ్లీ ఎన్నికల సమన్వ యకర్తగా సుబ్బారెడ్డిని అధిష్ఠానం నియమించింది. దీంతో పుంగనూరులో ప్రజాగళం సభలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబుకు సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు వెంట ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీని ఓడించి చంద్రబాబును సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని సుబ్బారెడ్డి అన్నారు.

రేపు పోలూరు వెంకటేశ్వరరెడ్డి వైకుంఠ సమారాధన


పోలూరు వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

బేతంచెర్ల, మే 7: బేతంచెర్ల పట్టణానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డికి మంగళవారం టీడీపీ నాయకులు, బంధువులు ఘనంగా నివాళి అర్పించారు. గురువారం పట్టణంలోని పోలూరు వెంకటేశ్వర రెడ్డి స్వగృహంలో వైకుంఠ సమారాధన నిర్వహించనున్నట్లు పోలూరు శ్రీనివాస్ రెడ్డి, పోలూరు రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు హాజరు కావాలని కోరారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'

చాగలమర్రి, మే 7: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని దూదేకుల సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. మంగళవారం నంద్యాలలో ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూర్‌బాషా దూదెకుల సంఘం ఆత్మీయ సమ్మేళన సమావేశానికి తరలివెళ్లారు. నాయకులు మస్తాన్, పీరయ్య, బాబయ్య, పెద్దబాషా, దస్తగిరి, లాల్‌బాషా, ఇమామ్ బాషా, ఉసేనయ్య, చిన్న దస్తగిరి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో భారీ వర్షం

నంద్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షం కురవడంతో గత రెండు నెలలుగా తీవ్రమైన ఎండలకు ఇబ్బందులు పడ్డ ప్రజలు ఉపశమనం చెందారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు బనగానపల్లె, అవుకు, సంజామల తదితర మండలాల్లో పెద్ద ఎత్తున గాలులు వీచి, ఓ మోస్తరు వర్షం కురిసింది. కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులకు చెట్లు నేలకూలాయి. పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

రుద్రవరం, మే 7: మండలంలోని కోటకొండ సమీపంలోని చెంచు గూడెం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కోటకొండ నుంచి గాజులపల్లె మెట్ట వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కోటకొండ గ్రామానికి చెందిన భాస్కర్(34) నంద్యాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మెహెర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడగా నంద్యాల నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భాస్కర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బనగానపల్లె, మే 7: బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి వైసీపీ, టీడీపీ ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంటా సుబ్బారావు వెల్లడించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వర్గానికి సంబంధించి 15 మందిపైన, బీసీ వర్గానికి సంబంధించి 15 మందిపైనా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అల్లర్లకు పాల్పడితే ఎవ్వరిని ఉపేక్షించేది లేదని అన్నారు.

కార్యకర్తలకే న్యాయం చేయలేని కాటసాని

- దౌర్జన్యం చేస్తే ప్రతి చర్య తప్పదు
- బీసీ నేత సుబ్బారావు హంతకులను వదలిపెట్టం
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, మే 7: తనను నమ్ముకొన్న సొంత పార్టీ కార్యకర్తలకే న్యాయం చేయలేని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కొలిమిగుండ్లతో పాటు మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో బీసీ ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా బహిరంగ సభలో బీసీ మాట్లాడుతూ వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడితే చర్యకు ప్రతి చర్య తప్పదని హెచ్చరించారు. బీసీ నేత వడ్డె సుబ్బారావును అన్యాయంగా హత్య చేశారని, హంతకులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. కొండలు, గుట్టలు, వంకలు, వాగులు ఆక్రమించుకున్నా కొలిమిగుండ్ల వైసీపీ నాయకులకు లేదని విమర్శించారు. వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు గుడి నిర్మించుకుంటుంటే దాన్ని కూడా అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇక్కడ జడ్పీ చైర్మన్ ఉన్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరుగలేదని విమర్శించారు. రైతుల సొంత ఆస్తులైన పాసుపుస్తకాలపై ప్రచార యావతో జగన్ తన ఫొటోలు ముద్రించుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రమేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, పులిప్రకాశ్‌రెడ్డి, ఉలవల నరసింహులు, నాగేశ్వరరెడ్డి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

చెల్లికి న్యాయం చేయని జగన్ ప్రజలకేం చేస్తారు: బైరెడ్డి శబరి

తన తండ్రి హత్య విషయంలో న్యాయం కోరుతున్న సొంత చెల్లెలు సునీతనే పట్టించుకోని సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ప్రశ్నించారు. మంగళవారం కొలిమిగుండ్ల రోడ్‌షోలో బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. బీసీ ఇందిరమ్మ ప్రచారం చేస్తుంటే రెచ్చగొట్టి దాడికి పాల్పడడం సిగ్గు చేటని విమ ర్శించారు. వైసీపీ పాలనకు ఇక వారం మాత్రమే గడువుందని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కూటమి ప్రభుత్వమేనని బైరెడ్డి శబరి ధీమా వ్యక్తం చేశారు.

ఇంటి పట్టాలకు వైసీపీ వసూళ్లు: బీసీ ఇందిరమ్మ

సంజామల: డీకూడీ పట్టాలు ఇప్పిస్తామని, ఇంటి పట్టాలు ఇప్పిస్తామని పేద ప్రజలనుంచి వైసీపీ నాయకులు రూ. లక్షల కమీషన్లు దండుకున్నారని తెలుగు మహిళ నాయకురాలు బీసీ ఇందిరమ్మ మండిపడ్డారు. మంగళవారం మండలంలోని పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాల్లో బీసీ ఇందిరమ్మ ప్రజాగళంలో పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిటార్ బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో బీసీ చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పేరుసోములలో ఎమ్మెల్యే కాటసాని ముస్లింలకు షాదీఖానా నిర్మిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే పేరుసోములలో షాదీఖానా నిర్మించి ముస్లింలకు అప్పజెప్తారని అన్నారు. కార్యక్రమంలో మంచాల మద్దిలేటిరెడ్డి, తులసిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బెలుం సురేశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఏళ్ల శ్రీనివాసులు, శీలావెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రచారకార్యదర్శి మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

'వైసీపీ ఓటమి తథ్యం'

అవుకు: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి, కూతురు మనోరమారెడ్డి, బీసీ మాధవి అన్నారు. మంగళవారం ప్రజాగళంలో పాల్గొనేందుకు చెన్నంపల్లె గ్రామానికి చేరుకున్న బీసీ కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, బసిరెడ్డి మధుమోహన్‌రెడ్డి, కాట్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీజీ శ్రీధర్‌రెడ్డిలతో బీసీ కుటుంబసభ్యులు కలసి ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలు అందించారు. బీసీ క్షీరారెడ్డి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి యత్నిస్తున్నారన్నారు. ఈచట్టంతో ప్రజలు పూర్తిగా నష్టపోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.నాగేశ్వరరెడ్డి, డీలర్ వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డిపల్లెలో ప్రజాగళంలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ, చెన్నంపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ కుటుంబ సభ్యులు

పోస్టల్ బ్యాలెట్‌తో వైసీపీ పతనం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, మే 7: ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌తో వైసీపీ పతనం ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వేసిన ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేసి టీడీపీకి అండగా నిలిచారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో భారీ వ్యతిరేకత ఉందని, ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, అబిరెడ్డిపల్లె గోవిందు, ఎర్రిస్వామి గౌడు పాల్గొన్నారు.

● **టీడీపీలోకి 50 వైసీపీ కుటుంబాలు:** పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో ఇందిరాంపల్లె గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాజీ సర్పంచ్ వెంకోబరావు ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

మండుటెండలో సుజాతమ్మ ఎన్నికల ప్రచారం

ప్యాపిలి: మండలంలోని చంద్రపల్లి గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మండుటెండను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై లక్ష్మీనారాయణ యాదవ్, వెంకటరమణాచారి, సురేంద్ర, బీజేపీ నాయకులు దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి


డోన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

పేదలకు రెండు సెంట్ల స్థలం: కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తారని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు యువనేత కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల రాఘ వేంద్రరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో దోపిడీ చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మవరం పెద్దనాగిరెడ్డి, చిన్ననాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, సంజీవుడు పాల్గొన్నారు.

● **దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్:** టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇస్తారని డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. మంగళవారం మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు రంజిత్ కిరణ్, యువ నాయ కుడు ధర్మవరం భరత్ రెడ్డి, మిన్నెల్ల, నబీరసూల్, సౌజన్య, చాటకొండ రజని పాల్గొన్నారు.

'భూ హక్కు చట్టంతో రైతులకు నష్టం'


ప్యాపిలిలో వీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తెచ్చిన భూ హక్కు చట్టంతో రైతులకు నష్టం జరుగుతుందని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే నాయకులు భూములను గద్దల్లా తన్నుకుపోతారని టీడీపీ ఆళ్లగడ్డ ఎన్నికల పరిశీలకుడు కేవీ సుబ్బారెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనసేన నాయకులు ఇరిగెల విశ్వనాథరెడ్డి, రాంపుల్లయ్య, రత్నమయ్య పాల్గొన్నారు.

ప్యాపిలి: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను దగా చేసే భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. రైతుల చీకటి జీవోను నిరసిస్తూ మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ వైసీపీ అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో భవిష్యత్తులో రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం వీఆర్వో సోమశేఖర్‌నాయుడుకు టీడీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గండికోట రామసుబ్బయ్య, వెంకట రమణాచారి, చల్లా వీరాంజినేయులు, నాగేంద్ర, కలచట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

శిరివెళ్ల: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని రైతుల భూములకు రక్షణ కరువైందని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైసీపీ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022ను రద్దు చేయాలని మండలంలోని టీడీపీ నాయకులతో కలిసి శిరివెళ్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుర్రప్ప, రామ, ఫిదా హుసేన్, మురళి, పీపీ లింగమయ్య, నాగేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, జయ రామిరెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

రుద్రవరం, మే 7: ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలు 21 గ్రామపంచాయతీల పరిధిలో తాగునీటి సమస్య ఏదైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కొత్త పనులు చేయకుండా మంచి నీటిప థకాలకు మరమ్మతులు చేయించడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏవో వరలక్ష్మి, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, ఏపీఎం కల్పలత తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 1,198 పోస్టల్ బ్యాలెటు ఓట్లు

డోన్, మే 7: డోన్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండో రోజు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగింది. మొత్తం 1,198 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో డోన్ నియోజకవర్గానికి సంబంధించి 159 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వ రరెడ్డి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌ను పరిశీలించారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, మే 7: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహుడు, పుల్లయ్య, సూర్యనారాయణరెడ్డి 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పృథ్వీరాజ్‌కుమార్‌రెడ్డి, బాబయ్య, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం గ్రామానికి చెందిన నవీన్, సునీల్, నర్సింహతో పాటు మరో 20 కుటుంబాల మంగళవారం టీడీపీలో చేరాయి. భార్గవరామనాయుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆళ్లగడ్డలోని భూమా స్వగృహంలో చేరారు. కార్యక్రమంలో పోలా గురుమూర్తి, సురేష్ ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వం నేలమట్టం కావడం ఖాయం

డోన్(రూరల్), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం నేలమట్టం కావడం ఖాయమని డోన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి అన్నారు. మంగళవారం పట్టణంలోని మారుతినగర్‌లోని పలు వీధుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మద్దిలేటి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల మండలం మినహాయించి, ప్యాపిలి, డోన్ మండలాలను వైసీపీ పాలకులు గుర్తించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డె రాజశేఖర్, రంగనాయకులు, బాలు, మద్దయ్య, నాగలక్ష్మయ్య, మహేష్, రాజు పాల్గొన్నారు.

ఘర్షణ- కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, మే 7: మండలంలోని కనక్రాదిపల్లె గ్రామంలో అన్నయ్య నాపరాళ్ల డిపో వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి డిపో వద్ద నాపరాళ్ల ట్రాక్టర్ పెట్టి వెళ్తుండగా శివశంకరరెడ్డి అనే వ్యక్తి గొడవ పెట్టుకొని గంగాధరరెడ్డిపై దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీతోనే అందరికీ న్యాయం: భూమా అఖిలప్రియ



కోటపాడులో ప్రచారం చేస్తున్న భూమా అఖిలప్రియ, టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో..

నంద్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అందరికీ న్యాయం జరుగుతుందని టీడీపీ ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో మంగళవారం అహోబిలం గ్రామానికి చెందిన గూడూరు ఎల్లాలు, కొత్తకొట్టాల సుబ్బారెడ్డితో పాటు 20 కుటుంబాలు ఆమె సమక్షంలో టీడీపీ చేరాయి. అలాగే మండలంలోని బత్తలూరు గ్రామానికి చెందిన ఇరిగెల మహేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో పాటు 10 కుటుంబాలు, రుద్రవరం మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామానికి చెందిన జవ్వాజి మధుగౌడు, మాధవగౌడుతో పాటు 50 కుటుంబాలు, పి.చింతకుంట గ్రామానికి చెందిన నబీరసూల్, గైబువలి, జాఫర్, లక్కు రవిలతో పాటు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో భార్గవ్‌రామ్‌నాయుడు, గంగుల పృథ్వీరాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కరువు: అఖిలప్రియ

శిరివెళ్ల: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. ప్రజాగళంలో భాగంగా మండలంలోని కోటపాడు గ్రామంలో మంగళవారం ఆమె ప్రచారం చేశారు. అఖిలప్రియ మాట్లాడుతూ రైతుల భూములను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి పరిపాలన సాగించాలని చూస్తున్న జగన్‌ను ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, శేష ఓబుళరెడ్డి, రాంపుల్లయ్య, ఓబుళకొండారెడ్డి, జయసింహారెడ్డి, శకుంతలమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం తప్పదు'

దొర్నిపాడు: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామాల్లో ప్రజాగళం నిర్వహించారు. మండల మాజీ అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, ఏరువ ప్రసాదురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మల్లేశ్వర చౌదరి ఉన్నారు.

'రాక్షస పాలనకు చరమగీతం పాడాలి'

చాగలమర్రి: రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం చాగలమర్రి గ్రామంలోని 16, 17 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ ఎన్నికల పరిశీలకుడు కేవీ సుబ్బారెడ్డి, నాయకులు మాజీ జడ్పీటీసీ రామసుబ్బయ్య, నాగరాజు, నరసింహులు, పుల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మౌలాలి, అనీఫ్, శ్యాబుల్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ జెండాను ఎగురవేస్తాం'

ఆళ్లగడ్డలో టీడీపీ జెండాను ఎగురవేయడం తథ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండులో ఉసేన్‌వలి, షరీఫ్ ఆధ్వర్యంలో భూమా జగత్ విఖ్యాతరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గజమాలలతో సన్మానించారు. భూమా జగత్ విఖ్యాతరెడ్డి కేక్ కట్ చేశారు. అలాగే భూమా నగర్‌లోని టీడీపీ యువనాయకుడు పి.ఉసేన్‌బాష నివాసంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్వర్ బాషా, మాజీ జడ్పీటీసీ చక్రపాణిగౌడ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో అభివృద్ధి ఎక్కడ?

రుద్రవరం: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఐదేళ్లలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని రెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఎక్కడ అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎల్వీ రంగనాయకులు, గురుమూర్తి, రామచంద్రుడు, రాజారావు, సుబ్బారావు, యువరాజ్, చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విఖ్యాత్ జన్మదిన వేడుకలు: మండలంలోని రెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు కార్యకర్తల మధ్య జరుపుకున్నారు. రామచంద్రుడు, రాజారావు, సుబ్బారావు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.


చాగలమర్రిలో ప్రచారం చేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి